క్లుప్తంగా

నేడు మంత్రి నిరంజన్‌రెడ్డి పర్యటన

అయిజ: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి గురువారం పలు అభివృద్ధి పనులు ప్రారంభించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పర్దీపురం సమీపంలో రూ.కోటి నిధులతో పూర్తిచేసిన ఎస్‌ఎఫ్‌టీపీని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

మంత్రికి జన్మదిన శుభాకాంక్షలు

శాంతినగర్: తెలంగాణ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డికి బీఆర్‌ఎస్వీ జోగుళాంబ గద్వాల జిల్లా కో ఆర్డినేటర్ పల్లయ్య జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వనపర్తి క్యాంపు కార్యాలయంలో బుధవారం కలిసిన ఆయన మంత్రికి పూల మొక్క అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

నేడు తహసీల్దార్ కార్యాలయం ప్రారంభం



ఎర్రవల్లిచౌరస్తా: ఇటీవల నూతన మండలంగా ఏర్పడిన ఎర్రవల్లిలో గురువారం తహసీల్దార్ కార్యాలయాన్ని ప్రారంభించనున్నట్లు ఇటిక్యాల తహసీల్దార్ వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. ప్రారంభోత్సవానికి వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి, శాసనమండలి ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే అబ్రహాంలు హాజరవుతారని పేర్కొన్నారు. ఎర్రవల్లి మండలంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా నందిని (డీటీ), ఆర్‌ఐగా సుదర్శన్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్‌గా శోభ, సీనియర్ అసిస్టెంట్‌గా తిరుమలేష్ (డిప్యుటేషన్), కార్యాలయ సబార్డినేటర్‌గా అంజనమ్మ లను కేటాయించారు.

ఐదుగురు యువకులు పోలీసులుగా ఎంపిక

గట్టు: మండల కేంద్రానికి చెందిన ఐదుగురు యువకులు పోలీస్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. పోలీస్ ఉద్యోగాలకు ఎంపికైన వారి జాబితాను బుధవారం రాత్రి ప్రకటించిన నేపథ్యంలో వీరేంద్ర సాగర్, బోయ రామాంజనేయులు, కుర్వమల్లేష్, బోయ సిరాంజనేయులు, బంగారు రాజ్‌కుమార్ పోలీస్ ఉద్యోగాలకు ఎంపిక కావడంతో గ్రామస్తులు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

ప్రభుత్వ భూమి కబ్జాకు కుట్ర

ధరూరు: మండలంలోని గార్లపాడులో సర్వే నంబర్ 179లోని ప్రభుత్వ భూమిని గ్రామానికి చెందిన కొందరు కబ్జా చేసేందుకు కుట్రలు పన్నుతున్నారని ఎంపీటీసీ రఘువర్ధన్‌రెడ్డి ఆరోపించారు. ఈ విషయమై మండల తహసీల్దార్, ఆర్‌డీఓలకు చెప్పినా పట్టించుకోవడం లేదని సామాజిక మాధ్యమాల గ్రూప్‌ల ద్వారా పోస్టులు పెట్టి ఆరోపించారు.

ధరూరులో కమ్యూనిటీ హెల్త్ సర్వే

ధరూరు: మండల కేంద్రంలో బీఎస్సీ నర్సింగ్ కళాశాల గద్వాలకు చెందిన విద్యార్థినులు కమ్యూనిటీ హెల్త్ సర్వే నిర్వహించారు. బుధవారం గ్రామంలో ఇంటింటికి తిరిగి కుటుంబ సభ్యుల వివరాలతో పాటు ఆరోగ్య సమస్యలు తదితర అంశాలపై వివరాలు సేకరించారు. మొత్తం 89 మంది విద్యార్థినులు ఇంటింటి సర్వేలో పాల్గొన్నట్లు ఆరోగ్య పర్యవేక్షకుడు హీర్యానాయక్ తెలిపారు. పాఠ్యాంశంలో భాగంగా విద్యార్థినులు వారం రోజుల పాటు గ్రామంలో ఉంటున్నట్లు తెలిపారు.

మూడేళ్ల క్రితం నిర్మించిన బ్రిడ్జి ఇప్పుడు ప్రారంభం

మానవపాడు: మండలంలోని కలుకుంట్ల వాగుపై మూడేళ్ల క్రితం బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి చేశారని, దాన్ని ఇప్పుడు కొత్తగా ప్రారంభించడం ఏమిటని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కేశవరావు అన్నారు. బుధవారం మండలంలోని కలుకుంట్ల బ్రిడ్జి నిర్మాణం పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకా కార్యక్రమం

మానవపాడు: మండలంలోని అమరవాయిలో ఎంపీహెచ్‌ఓ సత్యనారాయణ, ఏఎన్‌ఎం మాబి అధ్వర్యంలో బుధవారం వ్యాధినిరోధక టీకా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భవతులు, చిన్నపిల్లల కు వ్యాధినిరోధక టీకా అందించామన్నారు. కార్యక్రమంలో గర్భిణులు పాల్గొన్నారు.

సొంత భవనాలు ఏర్పాటు చేయాలి

గద్వాల అర్బన్: జిల్లాలోని గురుకుల విద్యాలయాలకు సొంత భవనాలను ఏర్పాటు చే యాలని బహుజన సేన జిల్లా అధ్యక్షుడు దాన య్య బుధవారం హైదరాబాద్‌లో బీసీ గురుకులాల కార్యదర్శి మల్లయ్యబట్టుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మహాత్మ జ్యోతిభాపూలే విద్యాలయాల్లో సరైన వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

బతుకమ్మ చీరల పంపిణీ



కేటీదొడ్డిలో చీరలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ మనోరమ



ధరూరులో..

ధరూరు: తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తరువాత అనేక రకాల సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ప్రధానంగా ఆడ పడుచులకు పెద్దన్నలాగా బతుకమ్మ చీరలు పంపిణీ చేయడం ఎంతో సంతోషకరమని జెడ్పీటీసీ సభ్యురాలు పద్మా వెంకటేశ్వరరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో గ్రామ సర్పంచు పద్మతో కలిసి ఆమె చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు డీఆర్ శివలీల, దౌలన్న, ఎంపీడీఓ ఎండీ జబ్బార్, ఎంపీఓ కృష్ణమోహన్, పంచాయతీ కార్యదర్శి తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

కేటీదొడ్డి: తెలంగాణ ఉద్యమంతోనే బతుకమ్మకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు లభించిందని ఎంపీపీ మనోరమ అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన బతుకమ్మ చీరల పంపిణీకి ఎంపీపీ మనోరమ, మండల అధ్యక్షుడు ఉరుకుందు హాజరయ్యారు. సీఎం కేసీఆర్ అన్ని పండుగలను అధికారికంగా నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మహమ్మద్ అజార్ మోహీద్దీన్, సర్పంచ్ పావని, ఎంపీటీసీ భీమయ్య, పంచాయతీ కార్యదర్శి రంగన్న, హనుమంతు, చక్రధర్, ఏపీఎం అన్నపూర్ణ, మహిళలు పాల్గొన్నారు.

రూ.1.5 కోట్ల పనులకు భూమిపూజ



అలంపూర్‌లో షాదీఖానకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే అబ్రహాం

అలంపూర్ రూరల్: అన్ని మతాలను గౌరవించే వ్యక్తి సీఎం కేసీఆర్ అని అలంపూర్ ఎమ్మెల్యే వీఎం అబ్రహాం అన్నారు. అలంపూర్ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో రూ.1.50కోట్ల పనులకు భూమిపూజ చేశారు. పట్టణంలోని రూ.30 లక్షలతో షాదీఖాన నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఇమాంపూర్ నుంచి లింగన్‌వాయికి వెళ్లే రోడ్డుకు రూ.50 లక్షలతో ప్రొటెక్షన్ వాల్ నిర్మాణం, క్యాతూర్‌లో రూ.25 లక్షలతో ముస్లిం మైనార్టీ కమ్యూనిటీ హాల్‌కు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ, కౌన్సిలర్లు సుదర్శన్‌గౌడ్, జయలక్ష్మి, సకినాబీ ఉన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

అలంపూర్: అలంపూర్ చౌరస్తాలోని క్యాంపు కార్యాలయంలో అయిజ మున్సిపాలిటీకి చెందిన నాయకులు సీఎం సురేష్, మల్లికార్జున్, మల్లికార్జున్ రెడ్డిల ఆధ్వర్యంలో 100 మంది బీజేపీకి చెందిన కార్యకర్తలు బుధవారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహం గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

రాజోళి: మండల కేంద్రంలో రూ.35 లక్షలతో నిర్మించనున్న షాదీఖాన భవనానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీరామ్‌రెడ్డి, జెడ్పీటీసీ సుగుణమ్మ, వైస్ ఎంపీపీ రేణుక, ఉప సర్పంచ్ గోపాల్ పాల్గొన్నారు.

మానవపాడు: మండలంలోని కొర్విపాడులో రైతు వేదిక, వైకుంఠదామం ప్రారంభించి, బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాసులు, అడిషనల్ డీఆర్‌డీఓ నాగేంద్రం, ఎంపీడీఓ రమణరావు, ఆర్ఐ రజనీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

శాంతినగర్: వడ్డేపల్లి మండల పరిధిలోని తనగలలో రూ.30 లక్షల సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఆర్డీఎస్ మాజీ చైర్మెన్ సీతారామిరెడ్డి, ఎంపీపీ రజిత, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ రఘునందన్‌రెడ్డి పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యార్థినులకు వైద్య పరీక్షలు



ధరూరు: మండలంలోని గుడ్డెందొడ్డి రిజర్వాయర్ దిగువనున్న నెట్టెంపాడు క్వార్టర్స్‌లో కొనసాగుతున్న అలంపూర్ కేజీబీవీ పాఠశాల విద్యార్థినులకు బుధవారం పీహెచ్‌సీ ఆరోగ్య పర్యవేక్షకుడు హీర్యానాయక్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మందులు పంపిణీ చేశారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వైద్య సేవలు అవసరమైతే వెంటనే ధరూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందాలని తెలిపారు.

భిక్షాటన చేస్తూ ఆశా వర్కర్ల నిరసన



ఇటిక్యాల తహసీల్దార్ కార్యాలయం ఎదుట భిక్షాటన చేపట్టిన ఆశాలు

అలంపూర్: ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆశా వర్కర్లు భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. రాష్ట్రం వ్యాప్తంగా సమ్మె చేస్తున్న ప్రభుత్వంలో స్పందన కొరవడిందని, ప్రధాన వీధుల్లో భిక్షాట చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నరసింహ మాట్లాడారు. కార్యక్రమంలో నాగేశ్వరమ్మ, భారతి, అంజనమ్మ, పద్మ, కృష్ణవేణి, నాగలక్ష్మమ్మ, ఇమాంబీ, చిట్టెమ్మ, శ్రీదేవి ఉన్నారు.

మల్దకల్: ప్రభుత్వం తమ సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలో ఆశా కార్యకర్తలు భిక్షాటన చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కాంతమ్మ, సుజాతలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆశాల సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో నర్సమ్మ, శంకరమ్మ, భారతమ్మ, కేశమ్మ, కృష్ణవేణి, సుజాత పాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండల కేంద్రంలో ఆశా కార్యకర్తలు చేపట్టిన నిరవధిక సమ్మె తొమ్మిదో రోజుకు చేరింది. ఈ సందర్భంగా తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో, హోటళ్ల ముందు ఆశా కార్యకర్తలు భిక్షాటన చేసి నిరసన తెలిపారు.

రాజోళి: తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం స్పందించాలని కోరుతూ ఆశా వర్కర్లు చేస్తున్న సమ్మెలో భాగంగా మండల కేంద్రంలో భిక్షాటన చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ధరూరు: మండల కేంద్రంలో దుకాణాల వద్ద ఆశా వర్కర్లు భిక్షాటన చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు భాగ్యమ్మ, సమిత, మాధవి, జ్యోతి పాల్గొన్నారు.



అలంపూర్‌లో భిక్షాటన చేస్తున్న ఆశా వర్కర్లు



మల్దకల్‌లో..

దేశ గౌరవం కాపాడటం అందరి బాధ్యత



గద్వాల: దేశ గౌరవం, స్వేచ్ఛను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి డీకే స్నిగ్ధారెడ్డి అన్నారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల నుంచి సేకరించిన మట్టిని బుధవారం పార్టీ కార్యాలయంలో అందజేశారు. దేశం కోసం అమరులైన జవాన్లు, త్యాగమూర్తులను స్మరించుకోవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ గడ్డం కృష్ణారెడ్డి, రవికుమార్, రాజగోపాల్, రాధాకృష్ణారెడ్డి, కబీర్‌దాస్ నర్సింహులు, సత్యం పాల్గొన్నారు.

ప్రతి ఇంటి నుంచి మట్టి సేకరణ

కేటీదొడ్డి: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ 'నాభూమి-నా దేశం' కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని పాతపాలెంలో మట్టి సేకరణ కార్యక్రమానికి బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డీకే స్నిగ్ధారెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గడ్డం కృష్ణారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ రామాంజనేయులు, మండల అధ్యక్షుడు హన్మిరెడ్డి, మండల ప్రధానకార్యదర్శి రాములు, నాయకులు ఎర్ర బీంరెడ్డి, నాగిరెడ్డి, నాగేష్, దేవేందర్ రెడ్డి, శ్రీను ఉన్నారు.

సమతుల్య ఆహారం తీసుకోవాలి



గట్టు: గర్భిణులు, బాలింతలు సమతుల్య ఆహారం తప్పని సరిగా తీసుకోవాలని మల్దకల్ ప్రాజెక్టు సీడీపీఓ కమలాదేవి సూచించారు. ఆస్పిరేషన్ బ్లాక్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం సంకల్ప్ సత్తా కార్యక్రమం అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించారు. రాయాపురం, గట్టు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను సీడీపీఓ సందర్శించారు. ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు వెంకట్రావమ్మ, ఉమామహేశ్వరి, సుజాతమ్మ, రాజేశ్వరి, సరస్వతి పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థులకు ఆన్‌లైన్ మోసాలపై వివరిస్తున్న రిజర్వ్ బ్యాంక్ ప్రతినిధులు

ఎర్రవల్లిచౌరస్తా: సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి నరసింహ అన్నారు. బుధవారం ఇటిక్యాల మండలంలోని ఎర్రవల్లి పదో పటాలంలోని ప్రభుత్వ పాఠశాలలో బాలల హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే అనార్థాలు, సైబర్ నేరాలు, బాల కార్మికులు, బాల్య వివాహాలు, మూఢనమ్మకాలు, షీ టీమ్స్, డయల్ 100 తో పాటు ప్రస్తుతం జరుగుతున్న పోకడల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ శివలీల, పీఎస్ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

శాంతినగర్: ఆన్‌లైన్ మోసాల గురించి ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని రిజర్వ్‌బ్యాంక్ ప్రతినిధులు అరవింద్, శివారెడ్డిలు విద్యార్థులకు వివరించారు. శాంతినగర్ ఎల్‌ఎస్‌ఆర్ బీఈడీ కళాశాలలో ఎలక్ట్రానిక్ బ్యాంకింగ్ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల ఆన్‌లైన్ మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఎల్‌ఎస్‌ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రకాష్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలు పాటించాలి

రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలు, సైబర్ నేరాలపై వడ్డేపల్లి మండలంలోని బుడమొర్సులో బుధవారం రాత్రి రాజోళి ఎస్‌ఐ ఖాదర్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రహదారులపై ప్రయాణిస్తున్నప్పుడు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, సైన్‌బోర్డును గమనిస్తూ వెళ్లాలని సూచించారు. బాల్య వివాహాలు చేయడం వల్ల బాలికలకు జరిగే అనర్థాల గురించి కళాబృందం సభ్యులు పాటల రూపంలో వివరించారు. కార్యక్రమంలో పోలీస్ భరోసా, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



బుడమొర్సులో అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంస

అయిజ: జగిత్యాలలో ఈనెల 2వ తేదీ నిర్వహించిన రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను బుధవారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో మాస్టర్‌లు మధుకుమార్, నవదీప్, అలితాఫ్, వెంకటేష్, అంజిగౌడ్‌లు అభినందించారు. శశిరేఖ, శ్రీకావ్యలు బంగారు పతకాలు, సహీన్, కిరణ్ కుమార్‌లు వెండిపతకాలు, పావని, మోష్మిరక్షిత, సాయిగుణ వైష్ణవి, రామ్‌తేజ్‌లు కంచు పతకాలు సాధించినట్లు పేర్కొన్నారు. ఈ విద్యార్థులు అస్సాం రాష్ట్రంలోని గుహవాటిలో నిర్వహించే జాతీయస్థాయి పోటీల కు ఎంపికైనట్లు తెలిపారు.



రాబోయే ఎన్నికల్లో పార్టీని గెలిపించండి

- జెడ్పీ చైర్ పర్సన్ సరిత



మాట్లాడుతున్న జెడ్పీ చైర్ పర్సన్ సరిత

కేటీదొడ్డి: కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని, రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని జెడ్పీ చైర్ పర్సన్ సరిత అన్నారు. మండలంలోని కుచినెర్లలో తిరుగబడదాం-తరిమికోడదాం కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ తెలంగాణ రాష్ట్రంలోని నియంత పరిపాలన కొనసాగుతుందని, పేద ప్రజలకు అందుబాటులో ఉండి పని చేసే పార్టీ కాంగ్రెస్ అని అన్నారు. కార్యక్రమంలో బండ్ల చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీటీసీ గీత, కృష్ణారెడ్డి, వెంకట్రామిరెడ్డి, శ్రీనివాస్‌గౌడు, మహానందిరెడ్డి, సురేష్,గోవిందు, శ్రీను, రవి పాల్గొన్నారు.

ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగడతాం



మాట్లాడుతున్న సంపత్‌కుమార్

శాంతినగర్: బీఆర్‌ఎస్, బీజేపీలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని, ప్రజలకు చేసిన అన్యాయాలు, వారి అవినీతి గురించి ఎండగడతామని ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ అన్నారు. వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్ కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో బుధవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ, బీఆర్‌ఎస్‌లు తొమ్మిదేళ్లుగా పరిపాలన చేస్తూ ప్రజలకు ఎన్నో హామీలు గుప్పించి మోసం చేశారన్నారు. అలంపూర్ నియోజకవర్గంలో 62 వేల ఇండ్లకు చార్జ్‌షీట్ అందజేస్తూ బీఆర్‌ఎస్, బీజేపీ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తామన్నారు. అంతేగాక పోస్టు కార్డుపై ప్రజల సంతకాలు సేకరించి సీఎం కేసీఆర్‌కు వారి అవినీతి చిట్టాను పంపుతామన్నారు. అనంతరం బీఆర్‌ఎస్, బీజేపీల వైఫల్యాలు, అవినీతికి సంబంధించిన కరపత్రాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఏఐసీసీ అబ్జర్వర్లు సందీప్‌కుమార్, సునీత ఐహోలీ, నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు, యూత్ అధ్యక్షులు పాల్గొన్నారు.

వరదముంపు లబ్ధిదారుల ఎంపిక

మానవపాడు: మండలంలోని మద్దూరులో తుంగభద్ర నది 2009 వరద ముంపునకు గురికావడంతో గ్రామం మురిగిపోయింది. వారికి నివాసగృహాల ఏర్పాటుకు ప్రభుత్వం 30.26 ఎకరాల ప్రభుత్వ భూమిలో 515 మంది లబ్ధిదారులకు ఇళ్లస్థలాలు ఇచ్చేందుకు ఎంపిక చేశారు. తహసీల్దార్ జుబెర్ మొహినొద్దీన్, ఎంపీడీఓ రమణరావు, డిప్యూటీ తహసీల్దార్ ధరణిషా, ఆర్ఐ రజనీకాంత్‌రెడ్డి, ఎంపీపీ అశోక్‌రెడ్డి, సర్పంచ్ లక్ష్మీదేవిల ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో నిజంగా ఇళ్ల వరదలో మునిగిపోయిన లబ్ధిదారుల జాబితాను కలెక్టర్‌కు పంపుతామన్నారు. ఇంకా ఎవరైనా లబ్ధిదారులు ఉంటే కలెక్టర్‌కు, రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ నరేష్, కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

104ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి



రిలే నిరాహార దీక్ష చేస్తున్న 104ఉద్యోగులు

గద్వాల అర్బన్: 15ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో ప్రజలకు సేవలందిస్తున్న 104ఉద్యోగులను రెగ్యూలర్ చేయాలని మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బీచుపల్లి డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని రాజీవ్‌మార్గ్‌లో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని అర్హతలు ఉన్నప్పటికీ ప్రభుత్వం రెగ్యూలర్ చేయడం లేదన్నారు. సమ్మెకు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి మద్దతు తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో 104ఉద్యోగులు చందు, శ్రీహరి, శివకుమార్, బాలరాజు, అతిఖ్ అహ్మద్, ఆంజనేయులు ఉన్నారు.

తపాలా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



సమ్మె చేస్తున్న గ్రామీణ తపాలా ఉద్యోగులు

గద్వాల అర్బన్: గ్రామీణ తపాలా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా కేంద్రంలోని క్రిష్ణారెడ్డి బంగ్లా వద్ద పోస్టాఫీస్ ఎదుట బుధవారం ఒక రోజు సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీడీఎస్ ఉద్యోగులను సివిల్ సర్వెంట్ ఉద్యోగులుగా గుర్తించాలని, సీనియర్ గ్రామీణ తపాల ఉద్యోగులకు 12, 24, 36 ఏళ్ల సర్వీసుకు అదనపు ఇంక్రిమెంట్స్ మంజూరు చేయాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ రూ.5లక్షలకు పెంచాలని, గ్రాట్యుటీ రూ.5లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు.

ఒక రోజు సమ్మె విజయవంతం

మానవపాడు: మండలకేంద్రంలోని సబ్‌పోస్టాఫీస్ జీడీఎస్ స్టాఫ్ అధ్యక్షుడు లక్ష్మన్న ఆధ్వర్యంలో బుధవారం ఒక రోజు సమ్మె నిర్వహించారు. కమలేష్ చంద్ర కమిటీ సిఫార్స్ చేసిన బంచింగ్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మునిస్వామి, రాజేష్ పాల్గొన్నారు.

వెంకటాపురంలో పశు వైద్యశిబిరం



కేటీదొడ్డి: పశువులకు రోగాలు రాకుండా టీకాలు వేయించుకోవాలని జిల్లా పశు సంవర్ధక అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని వెంకటాపురంలోని బుధవారం పశుసంవర్ధక శాఖ పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పశువులకు ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధి నిరోధక టీకాలు వేయించి పాడి సంపద పెంచి పాల ఉత్పత్తి చేసేలా రైతులకు సూచనలు చేశారు. దూడలకు నట్టల నివారణ, ముద్ద చర్మ వ్యాధి టీకాలు వేశారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది డాక్టర్ వినయ్‌కుమార్, వెంకటేష్, సర్పంచు ఆంజనేయులు, గోపాల్‌మిత్ర సూపర్‌వైజర్ రవి, గోపాల్‌మిత్రలు గోపాల్‌రెడ్డి, వెంకటేష్, భీమయ్య, గోపాల్ ఉన్నారు.